# సత్యవాక్కు



# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్య వాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు-మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

పోస్టు బాక్సు - **80**, కాకినాడ - **533 001**

ఎడిటర్ :
జె. సి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ :
జాషువా గూటం

సంచిక **10** మే **1986** సంపుటి **6**


## సంపాదకీయము

### క్రైస్తవులు ఎందుకు తొట్రిల్లుదురు ?

*(Why Do Christians Fall Away?)*

ప్రజలు దేవునికి విధేయులగుట చాల సంతోషం. ఆయనకు విధేయులగువారు పాపక్షమాపణ యనే ప్రతిఫలం తప్పక పొందుతారు. వారు దేవుని బిడ్డలవుతారు, క్రీస్తునందు సోదర సోదరీ లవుతారు, మరియు పరిశుద్ధాత్మ అనే వరాన్ని పొందుతారు. ప్రభువు వారితో యుంటాడని వారిని దీవిస్తాడనే వాగ్దానాన్ని పొందుతారు. ఈ బహుమానములు ఆశీర్వాదములు బాధ్యత రహితంగా రావు. ప్రభువు యిస్తాడు గాని, బదులుగా ఆయన కొంత కోరతాడు. ఉదాహరణకు తన ప్రజ లాయనకు విశ్వసనీయముగను, నమ్మకముగను, విధేయత కలిగియు యుండవలెనని ఆయన కోరుచున్నాడు. ఆయనను ప్రేమించు వారికి ఆయన యిచ్చుదానితో చూచుకొంటే ఆయన కోరేది బహు తక్కువ.

ప్రభువు యిచ్చు రక్షణను గూర్చి, దీవెనలను గూర్చి ఎరిగి యను కొందరు ఆయనను నిరాకరించి ఈ లోక మార్గముల తట్టు తిరుగు

దురు. క్రైస్తవుడైనవాడు ఎందుకు అట్టి పని చేస్తాడు? దీనిని కొంత పరీక్షిద్దాం. అట్లు చేయడంలో విషాదకరమైన అట్టి పొరబాట్లు చేయకుండా కొందరికి సహాయకరంగా యుండగలము.

1. దేవుని వాక్యం సరిపడినంతగా బోధింపబడక పోయినందున కొందరు పడిపోతారు. క్రీస్తు ఎవరో, ఆయన ఈ లోకానికి ఎందుకు వచ్చాడో, ఆయన యేమి కోరుచున్నాడో తెలియకుండా ఆయన యందు విశ్వాసముంచడం అసాధ్యం. కాగా వినుటవలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తునుగూర్చిన మాటవలన కలుగును అని పౌలు చెప్పాడు (రోమా 10:17). "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; దేవునియొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెనుగదా" (హెబ్రీ 11:6). విత్తువాని ఉపమానము చెబుతు విత్తనములలో "కొన్ని చాల మన్ను లేని రాతినేలను పడెను; అక్కడ మన్ను లోతుగా ఉండనందున అవి వెంటనే మొలిచెను గాని సూర్యుడు ఉదయించినప్పుడు అవి మాడి వేరులేనందున ఎండిపోయెను" అని యేసు ప్రభువు చెప్పాడు. దీనిని వివరిస్తూ, "రాతినేలను విత్తబడినవాడు వాక్యము విని వెంటనే సంతోషముతో దాని నంగీకరించువాడు; అయితే అతనిలో వేరు లేనందున అతడు కొంత కాలము నిలుచును గాని వాక్యము నిమిత్తము శ్రమయైనను హింసయైనను కలుగగానే అభ్యంతరపడును" అని ఆయన చెప్పాడు (మత్తయి 13:20, 21). క్రీస్తు వాక్యమును వినేవారుంటారు గాని దానిని పూర్తిగా గ్రహింపనివారు, విశ్వసింపనివారు ఉంటారు. వారు శిష్యత్వమూల్యాన్ని లెక్కింపరు. శోధన కాలములో అభ్యంతరపడతారు, క్రీస్తునుండి తొలగిపోతారు.

2. కొందరు సంఘమునుండి దూరమైన ప్రాంతములో యుండుట వలన, ఏకాకి యగుటవలన పడిపోతారు; లేదా వారికి తగినంత ప్రోత్సాహ మియ్యలేని ఒక చిన్న సంఘములో యుండుటవలన తొలగి

పోతారు. ఇట్టివారు సాధారణంగా క్రొత్తగా క్రైస్తవులైనవారు, లేదా విశ్వాసములో ఇంకా బలపడనివారు. ఒండొరుల సహవాసము యొక్క అవుసరాన్ని యిది మనకు జ్ఞప్తికి తెచ్చుచున్నది. మనం ఒకరినొకరు హెచ్చరించుకోడానికి, సత్క్రియలు చేయడానికి ఒకరి నొకరు పురికొల్పడానికి, తద్వారా ఆత్మీయముగను, సంఖ్యలోను పెరగడానికి యిది మనకు సహాయము చేయును. యెరూషలేములో సంఘము స్థాపింపబడిన తరువాత వారు "అపొస్తలుల బోధయందును, సహవాసమందును రొట్టె విరుచుటయందును ప్రార్థన చేయుటయం దును ఎడతెగక యుండిరి" యని చెప్పబడినది (అపొ.కా. 2:42).

3. అనేకులు ఈ లోకమువలన ప్రభావితులైనందున విశ్వాసమునుండి తొట్రిల్లుదురు. క్రైస్తవులు కానివారు, చెడు కార్యములు చేయువారు దేవుని బిడ్డలైన వారిని వారితో కలుపుకోడానికి ప్రయత్నంచేస్తారు. పలువిధాలుగా ఈ పనిని వారు చేయ ప్రయత్నిస్తారు. క్రీస్తును వెంబడించువారిని కొందరు హేళన వేయవచ్చు. ఈ లోక సంబంధమైన తమ అలవాట్లలో పాలుపొందుమని మరికొందరు శోధించవచ్చు. ఇట్టి దాడుల నెదుర్కొనడానికి కొందరికి ఆత్మీయబలముండదు. వాక్యమును వినిన తరువాత ఐహిక విచారమును, ధనమోసమును వాక్యమును అణచివేయును. అట్టివాడు నిష్ఫలుడగునని యేసుప్రభువు చెప్పాడు (మత్త 13:22).

4. కొందరు సహోదరులు మోసగించబడి అసత్యములోనికి నడిపింపబడతారు. పారంపర్యవశమైన అసత్యము మాత్రమే గాక, ప్రతిరోజు ఒక నూతన సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టువా రున్నారు. అందువలననే మనము మోసగించబడరాదని లేఖనములు పదేపదే మనలను హెచ్చరించుచున్నవి. ఉదాహరణకు ఎఫెసులోని సహోదరులకు పౌలు ఇట్లు వ్రాసాడు: "వ్యర్థమైన మాటలవలన ఎవడును మిమ్మును మోస

పరచనియ్యకుడి; ఇట్టి క్రియలవలన దేవుని ఉగ్రత అవిధేయులైన వారి మీదికి వచ్చును" (ఎఫెసీ 5:6, 7).

5. మరికొందరు అసూయ ద్వేషములవలన, తమ మాట పడ నందున తొలగిపోతారు. ఈ కోవకుచెందినవారిని గూర్చి తెలిసికోడానికి మనం బహుళ ఆశ్చర్యపడతాము. బహు స్వల్పమైన వాటినిగూర్చి సహోదరులు ఆయాసపడిపోతారు. చివరకు అవి నాశనకరమైనవవుతాయి. క్రైస్తవులు ఒండొరులయెడల కలిగియుండవలసిన స్వభావమును గూర్చి పౌలు ఇట్లు వ్రాసాడు: "సంతోషించువారితో సంతోషించుడి; ఏడ్చు వారితో ఏడువుడి; ఒకనితోనొకడు మనస్సు కలసియుండుడి. హెచ్చువాటియందు మనస్సుంచక తగ్గువాటియందు ఆసక్తులై యుండుడి. మీకు మీరే బుద్ధిమంతులమని అనుకొనవద్దు" (రోమా 12:15, 16).

ప్రభువు ప్రజలలో కొందరు పడిపోయే కారణాలు అనేకము న్నాయి. వాటిలో యేదీ సవ్యమైనది కాదు. ఆయనను విడిచి వెళ్ళు వారు బుద్ధిహీనులు, ప్రభువుతో వారికున్న సంబంధాన్నేకాక, భావిలో వారికున్న నిరీక్షణను వారు కోల్పోవుదురు. వారి పాపములనుగూర్చి మారుమనస్సుపొంది, తమ అపరాధములను ఒప్పుకొని, ప్రభువును సహోదరులను క్షమాపణ అడిగి వారు మరల ప్రభువునొద్దకు చేరుకొనుట సాధ్యము (యాకో 5:16).

వారు సంఘాన్ని విసర్జించినప్పుడు, క్రీస్తునుకూడ విసర్జించుచున్నారని వారెరుగరు. క్రీస్తు ఆయన సంఘము ఎడబాటుచేయ నేరనివి (ఎఫెసీ 5:23; 1 కొరింథీ 12:27). క్రీస్తును అంగీకరిస్తే ఆయన సంఘాన్ని అంగీకరించాలి; ఒకరిని నిరాకరిస్తే మరొకని నిరాకరించినట్లే గనుక నీవేమి చేయుచున్నావో జాగ్రత్త. తిరిగి రాలేనంతగా పడిపోదువేమో సరిచూచుకో.

నీవు క్రైస్తవుడవైన యెడల, నీ రక్షకునికి నమ్మకముగా జీవించుము. నామకార్థ క్రైస్తవుడవుగా మాత్రముండకుము. ఆయనకు మనః పూర్వకముగా పరిచర్య చేయుము. నీవు తొట్రిల్లిన క్రైస్తవుడవైతే ప్రభువునొద్దకు తిరిగి రమ్ము. ఆయనలో నిలిచి ఆయనకు నమ్మకమైన బిడ్డగా జీవించుము.

---

## సంఘము ఉండవలసిన ఏడు విధములు

### *(Seven things a Church ought to be)*

1. సంఘము దేవుని నివాస స్థలమై యున్నది: "ఆయనలో మీరుకూడ దేవునికి నివాస స్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫెసీ 2 : 22). ఆయన సజీవుడై యున్నాడని ప్రచురించుటకు సంఘము కూడి వచ్చినప్పుడు దానిలో ఆయన ప్రత్యక్షత యుండాలి.

2. అది భూమిపై క్రీస్తుయొక్క భౌతిక తత్వాన్ని ప్రకాశించే శరీరమై యున్నది: క్రీస్తు దానికి శిరస్సు (కొలస్స 1:18). "మీరు క్రీస్తుయొక్క శరీరమై యున్నారు" (1 కొరింథీ 12:27). శరీరము భూమిపై ఆయన కోరికలను ప్రకటించాలి.

3. అది ఆరాధనకు సహవాసానికీ కూడి వచ్చు సమాజమై యున్నది : ఇరువైపుల పంచుకొను వ్యక్తిగత సన్నిహిత సంబంధము సహవాసము. దేవునియొక్క నిజమైన విలువను ఆయనకు వర్తింప జేయడం ఆరాధన.

4. అది శిక్షణ నిచ్చు పాఠశాలయై యున్నది : రెండు విధములైన శిక్షణ నది యిచ్చును. క్రైస్తవుడగుట యెట్లో, క్రైస్తవ జీవితం జీవించుట యెట్లో అది నేర్పును. "సంఘము ద్వారా తనయొక్క నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని" ఆయన ఉద్దేశించాడు (ఎఫెసీ 3:11).

5. గాయపడ్డవారికది ఆసుపత్రి వంటిది: ఏ యుద్ధములోనైనా సరే గాయ పర్చబడినవారు వీరులవలె తిరిగి వస్తారు. అయితే అట్టి వారిని చూచుటకు సంఘములో ఆత్మీయవైద్యులు నర్సులు అవుసరం. గాయ పడ్డవారిని బాగుచేయడం సంఘ బాధ్యత.

6. బంధింపబడిన వారిని విమోచించే కేంద్రం అది: సంఘ సభ్యులను గాక అపవాదిని బయటకు పారద్రోలే పని మనది. సందేహములు, భయాందోళనలతో నిండిన వారు సంఘములో ఆదరణ కనుగొన గలగాలి.

7. అది దేవుని బిడ్డల గృహమై యుండాలి. సంఘము దేవుని గృహమైయున్నది (1తిమో 3:15). అందువలన విమర్శించబడతామనే భయము లేకుండా ఒకడు సంఘములో తన సమస్యలను, భారాలను సంతోషాన్ని, దుఃఖాన్ని వెల్లడించగలగాలి. సంఘములో సందేహ శీలులు, సణుగుకొనేవారు లేకపోతే మనందరం దూతలవంటివారమే. సంఘములో మాత్రమే అబ్బా తండ్రీ యని మనం పిలువగలము.

యేసు ప్రభువు తన రక్తంతో కొన్న సంఘాన్ని విమర్శించడం కొందరికి పరిపాటి. సంఘం ప్రాముఖ్యం కాదని వారంటారు. గాని పై సంగతులను గమనించిన తరువాత అది ప్రాముఖ్యం కాదని ఎవరనగలరు ?

—డగ్లస్ పార్సన్.

---

## వింత స్వరములు

### (*Strange Voices*)

వింత స్వరాలను పలికే లోకంలో మనం జీవించుచున్నాము; వాటిని మనం అన్నిసార్లు అర్థం చేసుకోలేము. ఎందువలనంటే ఒకే ప్రశ్నకు వారు వివిధ జవాబుల నిస్తారు.

"నేను పలు సంఘాలను వారి నాయకులను చూచాను. వారు వివిధ బోధలను బోధిస్తూ వారి సంఘములోనే చేరాలని నన్ను ఆహ్వానిస్తుండగా వారిలో ఎవరు రైటో నా కెట్లు తెలుస్తాది?" యని నా విద్యార్థి ఒకమారు నాతో అన్నాడు. ఈ యౌవనస్తునికున్న ఆసక్తి ఒకేఒక్కటి. అది రక్షింపబడుటకు నేనేమి చేయాలి అనే అతని ప్రశ్నలో వ్యక్తమై యున్నది. అయితే అతడడిగిన ప్రశ్నకు పలువిధమైన వింత జవాబులీయ బడ్డాయి. అవి కేవలం వట్టి మాటలని కేవలం మానవుల అభిప్రాయాలను మాత్రం వ్యక్తపర్చాయని అతడెరుగును.

క్రొత్త నిబంధనకు వేరై దాని యధికారము పొందని అన్ని స్వరాలు వింతమైనవి. అవి విసర్జించబడాలి.

భారతదేశంలోను, అమెరికా, నైజీరియా, కెన్యా, ఘనా దేశాలలోను బయలుదేరిన వందలకొలది డినామినేషన్లున్నాయి. యేసు ప్రభువును నిజంగా తెలసికొని ఆయన కొరకు జీవించాలని కోరే వానికిది ఒక తీవ్రమైన సమస్య. భక్తి మార్గంలో స్వవిరుద్ధ ప్రకటనలన్నీ సరియైనవి కావని అతడు గమనిస్తాడు; అవన్నీ తప్పుకావచ్చు. అయితే అవి క్రొత్త నిబంధన బోధనుండి వేరై రైటు గానేరవు.

విజ్ఞాన శాస్త్ర విద్యార్థి ఒకముగింపుకు రాకముందు వాస్తవాలన్నిటినీ వీక్షిస్తాడు. అయితే ఈ విషయంలో క్రైస్తవ్యము వేరుగా యున్నది. దీనిలోని వాస్తవాలన్నిటిని దేవుడు తన కుమారుడైన యేసు ద్వారా క్రొత్తనిబంధన గ్రంథంలో బయలుపర్చాడు. దేవుని నుండి కలిగిన వాస్తవాలు మనకున్నాయి గనుక మానవుడు చేసే స్వల్పయత్నాలను అంగీకరించడం మన సమయాన్ని వ్యర్థపరచడమే అవుతుంది.

వివిధ సంభాషణలలో రాజీపడుట ద్వారా దేవుని బిడ్డల ఐక్యత సాధ్యపడదు; అది దేవుని ఆజ్ఞలకు విధేయత చూపుట ద్వారా సాధ్యపడుతుంది. క్రొత్తనిబంధనను జాగ్రత్తగా చదివి దాని ఆజ్ఞలకు

లోబడాలి. మానవులందరికీ అది బోధించేది ఒక్కటే. అందరు ఒకే సంగతులను జరిగించునపుడు అందరు క్రీస్తునందు ఏకమై యుంటారు.

క్రైస్తవుడగుటలో మనం వేసే ప్రతి అడుగును పరీక్షించాలి. ప్రతి అడుగు దేవుని వాక్యముతో సమన్వయించి యుండాలి. క్రొత్త నిబంధనలో కనబడని అడుగు వేయమని ఎవరైనా నిన్ను ప్రోత్సహిస్తే దేవుని అధికారము పొందని వింత స్వరమువలె దానిని వెంటనే నిరాకరించాలి.

క్రైస్తవుడను పేరుగాక ఇంకేదో పేరుతో పిలువబడాలన్నప్పుడు దానిని నిరాకరించాలి. క్రొత్తనిబంధనలో కనబడని ఆరాధన క్రియము నిరాకరించబడాలి. క్రొత్త నిబంధనలో కనబడని ఏదో ఒక సంఘంలో యుండాలని ఎంత ఆసక్తితో నిన్నడిగినను, దానిని బలంగా నిరాకరించాలి.

దేవుని వాక్యంతో సమన్వయించని బోధలు చేయుచు మూల మూలల కనబడుచున్న సంఘాలను లక్ష్యపెట్టరాదని, మతసంబంధ విషయాల్లో క్రొత్తనిబంధన మాత్రమే అధికారయుక్తమైనదని అంగీకరించాలని నన్నడిగిన విద్యార్థికి తెలియజేయబడింది.

క్లుప్తముగా, క్రొత్త నిబంధన బోధించుచున్నట్లు క్రీస్తునందు విశ్వసించి పాపముల విషయమై మారుమనస్సునొంది, క్రీస్తే దేవుని కుమారుడని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందుటద్వారా క్రైస్తవుడు కావాలని అతనికి సలహా ఇయ్యబడింది. ఇంకా, క్రొత్త నిబంధన నిర్దేశించునట్లు ఆరాధించి, మరణ పర్యంతము నమ్మకమైన క్రైస్తవ జీవనము జీవించాలని అతనికి చెప్పబడింది. నిత్యరక్షణకొరకైన స్థిరమైన మార్గము యిదే. వింతస్వరములను ఆలకించవద్దు; అవి నాశనమునకు నడుపుతాయి.

క్రీస్తునందు మాత్రమే రక్షణ యున్నది (2 తిమో. 2:10).

విమోచనము కూడా క్రీస్తునందున్నది (ఎఫెసీ 1 : 7). పాపక్షమాపణ యేసుక్రీస్తునందున్నది (కొలస్స 1:14). నిత్యజీవము క్రీస్తునందున్నది (1 యోహాను 5:11). సమస్త ఆత్మీయాశీర్వాదములు క్రీస్తునందే యున్నవి (ఎఫె 1:13).

మనము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుతాము: "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:27). ఒకడు ఈ మరతులన్నిటికీ లోబడేవరకు క్రైస్తవుడు కానేరడు. బాప్తిస్మము అక్కర్లేదని వింతస్వరాలు పలికే వారందరు నశిస్తారు; గనుక వారి ఉపదేశమును నిరాకరించుము!

క్రొత్త నిబంధన ఇట్లు చెప్పుచున్నది: "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16). "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" యని 1 పేతురు 3:21 చెప్పుచున్నది.

పైన చెప్పబడిన బైబిలు అడుగులను నా విద్యార్థి వేసినప్పుడు అతడు క్రీస్తు శరీరములో సభ్యుడయ్యాడు; అదే క్రీస్తు సంఘము. దేవుని వాక్యములో గుర్తించబడినది అదొక్కటే (మత్తయి 16:18).

—లియాన్ ఎడ్మండ్స్.

---

## ఉన్న మార్గములు రెండే

### *( There are only Two ways )*

యేసు, "నేనే మార్గము; నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకురాడు" అని చెప్పాడు (యోహాను 14 : 6). ఈ మార్గము ఇరుకు మార్గమని ఆయన చెప్పాడు. ఇరుకు మార్గము సంకుచితమైనది. అంటే ఒకవ్యక్తి తనకుగా తాను అనేక సంగతులను విసర్జిస్తాడు.

ఇరుకు మార్గానికి వ్యతిరేకముగా విశాలమైన మార్గమున్నది. నైతికంగాను ఆత్మీయంగాను కొంతకాలం మట్టుకు మనకిష్టమైన వాటిని చేయవచ్చునుగాని చివరికది నాశనమునకు దారితీయును. కొంత కాలము మట్టుకు మనకిష్టం వచ్చినట్లు చేయవచ్చునని చెప్పాను. "పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని" యేసు చెప్పాడు (యోహాను 8:34). ఈ మాటల యొక్క నిర్ధారణ మనచుట్టు ప్రతి దినం చూస్తూనే యున్నాము. మానవుడు దేవుని నైతిక చట్టాన్ని ఉల్లంఘించి పాపము చేసినందున ఇప్పుడు 'ఎయిడ్స్' (AIDS) అనే ఘోరవ్యాధి ఉద్భవించినది. మంచం పట్టియున్న ఒక మనుష్యుని నేను దర్శించాను. అతడు కొన్ని వారలలో మరణిస్తాడని వైద్యుడు చెప్పాడు, సారా త్రాగుటవలన ఈ రోగి యొక్క కాలేయము దెబ్బతిన్నది. "విశ్వాస ఘాతకుల మార్గము కష్టమనే" నిర్ధారణ మనచుట్టూ ఉండే యున్నది (సామె 13 : 15). తన భర్తతో నానా బాధలు పడుచున్న స్త్రీ నాతో క్రైస్తవ జీవనం జీవించుట కష్టమని చెప్పింది. క్రైస్తవ జీవితం జీవింపకపోతే మరింత కష్టమని నేనామెకు సమాధానమిచ్చాను. వారు కోర్టు కెక్కారు. ఆమె ముగ్గురు బిడ్డల సంరక్షణ ఆమె కోల్పోయింది. అతిక్రమము చేయువారి మార్గము కష్టమనే సంగతిని చూచు కొన్నాము. గాని "నీతిమంతుల మార్గము అంతకంతకు తేజరిల్లును" అని మనము సామెతలు 4 : 18 లో చదువగలము.

## అపవాది మోసగిస్తాడు

మనం ఇంకెప్పుడు నేర్చుకొంటాము? నాకిప్పుడు 82 సంవత్సరములు. గనుక నేను మూడు తరాలలో జీవించాను. ప్రభువును వెంబడించుట కంటే అపవాదిని వెంబడించుటవలన సుఖాన్ననుభవించ గలదని హవ్వను సాతాను నమ్మించింది.

మద్యపానము మంచిది కాదని నిరూపించడానికి ఎందుకు ప్రయత్నించాలి? దీని నిర్ధారణ మనచుట్టూ ఉండేయున్నది. డేన్సింగ్ మంచిది

కాదని నిరూపించే సంగతులు మనచుట్టు ఉండేయున్నవి. గనుక అది తప్పు అని మనం నిరూపించ నక్కర్లేదు. పొగత్రాగుట మద్యపానము చేయుట డేన్స్ చేయుట మొదలగు వాటివలన కలుగు హాని గొప్పది. గనుక యౌవనులారా, వీటినన్నిటిని తనివి తీర రుచి చూచి ఆత్మా వేశమువలన లిఖించిన వాని మాటలను వినండి: "యౌవనుడా, నీ యౌవన మందు సంతోషపడుము, నీ యౌవన కాలమందు నీ హృద యము సంతుష్టిగా ఉండనిమ్ము; నీ కోరిక చొప్పునను నీ దృష్టియొక్క యిష్టము చొప్పునను ప్రవర్తింపుము; అయితే వీటన్నిటిబట్టి దేవుడు నిన్ను తీర్పులోనికి తెచ్చునని జ్ఞాపకముంచుకొనుము. లేత వయస్సును నడిప్రాయమును గతించి పోవునవి గనుక నీహృదయములోనుండి వ్యాకులమును తొలగించుకొనుము, నీ దేహమును చెరుపు దానిని తొలగించుకొనుము. దుర్దినములు రాకముందే, ఇప్పుడు వీటియందు నాకు సంతోషము లేదని నీవు చెప్పు సంవత్సరములు రాకముందే ... నీ బాల్యదినములందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము" (ప్రసంగి 11:9,10; 12:1).

## తెలివిగా ఎంచుకోవాలి

మోషే తెలివిగా యెంచుకొన్నాడు. "అల్పకాలము పాప భోగము అనుభవించుట కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవిం చుట మేలని" యోచించాడు (హెబ్రీ 11:25). ఐగుప్తు సింహాసనానికి మోషే వారసుడుగా యుండెనని చరిత్ర తెలియజేయుచున్నది. అయితే దేవుని ప్రజలను బానిసత్వమునుండి వాగ్దానము చేయబడిన దేశపు పొలిమేరలవరకు నడిపించుట కతను శ్రమలను, హింసలను ఎంచుకొన్నాడు. దేవునితో నడచుచు అతడు పది యాజ్ఞల నిచ్చాడు. మనలను క్రీస్తు నొద్దకు నడిపించుటకుగాను అతను మనకు ధర్మశాస్త్ర మ్నిచ్చాడు. మరల సొలొమోను ఉపదేశమును విందము: "దుష్ క్రియకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగకపోవుట చూచి మనుష్యులు భయము విడిచి హృదయ పూర్వకముగా దుష్క్రియలు చేయుదురు" (ప్రసంగి 8 : 11).

"కావున మీరు వారి మధ్యనుండి బయలు వెడలి ప్రత్యేక ముగా ఉండుడి; అపవిత్రమైనదానిని ముట్టకుడని ప్రభువు చెప్పుచున్నాడు. మరియు నేను మిమ్మును చేర్చుకొందును, మీకు తండ్రినై యుందును, మీరు నాకు కుమారులును కుమార్తెలునై యుందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నాడు" (2 కొరింథి 6 : 17, 18). మనం దేవుని బిడ్డలమై యుండాలంటే మనం శుద్ధి చేయబడాలి. గనుక "ప్రియులారా, మనకు ఈ వాగ్దానములు ఉన్నవి గనుక దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తి చేసికొనుచు, శరీరమునకును ఆత్మలకును కలిగిన సమస్త కల్మషమునుండి మనలను పవిత్రులనుగా చేసికొందము" (2 కొరింథీ 7:1). మనము నిజముగా దేవుని బిడ్డలమైతే దేవుని వారసులము, క్రీస్తు తోడి వారసులము (రోమా 8:17).

## వాడున్న పాపములే నేడు

క్రైస్తవ జీవితము ఒక క్రొత్త జీవితము. పరిశుద్ధాత్మని మాటలను మరల వినుము: "కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి, పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింథీ 5:17). నేడున్న పాపములే క్రొత్త నిబంధన కాలమునాటి ప్రజలలో కూడ యున్నవి. కొరింథు సంఘానికి పౌలు ఇట్లు వ్రాసాడు: "అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోసపోకుడి. జారులైనను విగ్రహారాధకులైనను వ్యభిచారులైనను ఆడంగి తనము గలవారైనను పురుష సంయోగులైనను, దొంగలైనను లోభులైనను త్రాగుబోతులైనను దూషకులైనను దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు" (1 కొరింథీ 6:9,10). నేటి ప్రజలను గూర్చి పౌలు ఇదే మాటలు చెప్పియుండును. ప్రతి ఒక్కడు ఈ పాపాలన్నిటినిబట్టి అపరాధి కాక పోవచ్చునుగాని వీటిలో ఒకటిగాని అంతకంటె ఎక్కువ వలనగాని అపరాధులు కానివారెవరు? అపరాధులు దేవుని రాజ్యమునకు వార

సలు కానేరరు. ఈ పాపములలోను, గలతీ 5 : 19-21లో చెప్పబడిన అపరాధములలోను హాని యేమీలేదని కొందరు వాదించవచ్చును. అక్కడ అల్లరితో కూడిన ఆటపాటలు జాబితాలో చేర్చబడినవి. అదే డాన్సింగ్; వీటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరు. అందరు అపరాధులే. అయితే క్రీస్తు ప్రవేశించేది ఇక్కడే: "మీలో కొందరు అట్టివారై యుంటిరిగాని, ప్రభువైన యేసు క్రీస్తు నామమునను మన దేవుని ఆత్మయందును మీరు కడుగబడి పరిశుద్ధ పరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడితిరి" (1 కొరింథీ 6:11).

## క్రీస్తులో క్రొత్త జీవితం

పాపియొకడు క్రైస్తవుడైనప్పుడు జరుగు మూడు సంగతులను గమనించుము. అతడు కడుగబడతాడు. మరెన్నడు జ్ఞాపకముండకుండ అతని పాపములు కడుగబడతాయి. ఎంత మహిమగల అనుభవమో.

అతడు పరిశుద్ధపరచబడతాడు. దేవుని సేవకొరకతడు ప్రత్యేకపరచబడతాడు. అతని పాత పాపములు అతనితో కూడ రావు.

అతడు నీతిమంతుడుగా తీర్చబడతాడు. అపరాధమునుండి, శిక్షనుండి విడుదలపొందినవాడని ప్రకటించబడతాడు. ఆరంభదినాల్లో క్రీస్తు సంఘస్థులైన వారినిగూర్చి చాడీలు చెప్పడానికి నాదగ్గరకు చాలమంది వచ్చేవారు. ఈ సంగతులు ఎప్పుడు జరిగినవి, అతడు క్రైస్తవుడైన తరువాతా లేక దానికి ముందా? యని నేనడిగేవాడిని. అతడు క్రైస్తవుడు కాకముందని వారు జవాబిచ్చేవారు. అట్లయితే వాటిని గూర్చి నేను వినదలచుకోను; ఏలయనగా వారు కడుగబడినవారు; నీతిమంతులని తీర్చబడినవారు, అంటే పాపపు అపరాధమునుండి విముక్తులైనవారని ప్రకటించబడినవారు. దేవుడు నీతిమంతులని తీర్చినప్పుడు శిక్షించేవాడెవడు? (రోమా 8.33, 34). మనము దేవుని పనికి ప్రత్యేకపబడినప్పుడు అపవాది పరిచర్యకు ఉపయోగపడమని బైబిలు బోధించుచున్నది.

అపవాది అబద్ధముల జనకుడు (యోహా 8:44). మన మతనికి సేవచేస్తే సుఖాన్ననుభవిస్తామని అతడు యావనులను ముఖ్యంగా నమ్మించ యత్నిస్తాడు. కాదు మనకు కలిగేది దుఃఖమే. "జీవమును ప్రేమించి మంచిదినములు చూడగోరువాడు చెడ్డదాని పలుకకుండ తన నాలుకను, కపటపు మాటలు చెప్పకుండ తన పెదవులను కాచుకొనవలెను. అతడు కీడునుండి తొలగి మేలు చేయవలెను, సమాధానమును వెదకి దాని వెంటాడవలెను. ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనలవైపునను ఉన్నవి గాని ప్రభువు ముఖము కీడుచేయువారికి విరోధముగా ఉన్నది" (1 పేతురు 3:10-12).

మనము ప్రతిష్ఠింపబడినంతమేరకు మన జిల్లాలోను లేక దేశములోను బలమైన సంఘాన్ని నిర్మించగలము. మనం దేవుని వాక్యాన్ని ఎరుగాలి: దేవుని వాక్యాన్ని విశ్వసించాలి, దేవునివాక్యానికి లోబడాలి. అప్పుడు పాతవి గతించును, సమస్తమును క్రొత్త వగును.

ప్రభువు వచ్చుచున్నాడు. దేవుని వాక్యమువలన మనకు తీర్పు తీర్చబడును. మనము దేవుని వాక్యానికి కలుపకూడదు, దానినుండి తీసివేయకూడదని చివరిగా ఆయన మనలను హెచ్చరించాడు (ప్రక 22:18, 19).

## వెనుకకు తిరిగితే ....?

మనము పాపములనుండి కడుగబడి, ప్రతిష్ఠింపబడి, నీతిమంతులుగా తీర్చబడినప్పుడు మన హృదయాల్లో గొప్ప సంతోషముండును. దేవుని సేవకొరకు మనము ప్రత్యేకించబడ్డాము. ఈ లోక అలవాట్లకు మనము మరల వెనుదిరిగినట్లయితే యేమి సంభవిస్తాది? "వారు ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు విషయమైన అనుభవ జ్ఞానముచేత ఈలోక మాలిన్యములను తప్పించుకొనిన తరువాత మరల వాటిలో చిక్కుబడి వాటిచేత జయింపబడిన యెడల వారికడవరిస్థితి మొదటి

కంటె మరిచెడ్డదగును. వారు నీతిమార్గములను అనుభవ పూర్వ
కముగా తెలిసికొని తమకు అప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞనుండి
తొలగిపోవుట కంటె ఆమార్గము అనుభవ పూర్వకముగా తెలియక
యుండుటయే వారికి మేలు. కుక్క తన వాంతికి తిరిగినట్టును, కడుగ
బడిన పంది బురదలో దొర్లుటకు మళ్లినట్టును అను నిజమైన సామెత
చొప్పున వీరికి సంభవించెను" (2 పేతురు 2 : 20-22).

— జె. సి. బెయిలీ

---

బైబిలు పాఠము :

## దేవునిగూర్చిన సత్యము-2

### దేవుని లక్షణములు

ఉపోద్ఘాతము :

A. దేవుడున్నాడని నమ్మితే ఆయన ఎవరు?

B. మన దేశములో 3 కోట్ల దేవుళ్ళున్నారట.

C. ప్రతిదాన్ని దాని స్వభావమును బట్టి గుర్తిస్తాము.
ఉదా : రాయిగాని, చెట్టుగాని, జంతువుగాని, మనిషిగాని దేవుడుగాని.

D. అలాగే దైవ లక్షణములను బట్టి దేవుని గుర్తించాలి.

II. పాఠము : దేవుని లక్షణములు.

A. దేవుడు సర్వశక్తి గలవాడు. ఆది 17:1.

1. ఆయనే సమస్తమును సృష్టించెను. ఆది 1:1.
2. ఆయనకు అసాధ్యమైనదేదియు లేదు. ఆది 18:19.
మత్తయి 19:26.
3. మానవుడు పరిమితమైన శక్తిగలవాడు.

B. దేవుడు సర్వజ్ఞుడు కీర్తన. 139:1-6.

1. ఆయన సమస్తము ఎరిగినవాడు. హెబ్రీ 4:13.

2. వర్తమాన భూత భవిష్యత్కాలములు ఎరిగినవాడు.

3. మానవుడు పరిమితమైన జ్ఞానముగలవాడు.

C. దేవుడు సర్వాంతర్యామి. కీర్తన 139:7-9.

1. దేవుడు అంతటా వున్నవాడు. యిర్మీయా 23:24.

2. దేవుడు ఒక స్థలమునకు పరిమితమైనవాడు కాడు.

3. మానవుడు ఒకే స్థలమునకు, స్థితికి పరిమితమైనవాడు.

D. దేవుడు నిత్యుడు. నిర్గమ 3:14.

1. దేవుడు ఉన్నవాడు.

2. ఆది అంతము లేనివాడు.

3. సృష్టికి, మానవునికి ప్రారంభము ముగింపు కలదు.

E. దేవుడు పరిశుద్ధుడు. యెషయ 6:3.

1. దేవుడు ప్రత్యేకమైన వాడు.

2. పాపము చేయుట దేవుని స్వభావము కాదు.

యోబు 34:10-12, తీతు 1:1-4.

3. "పాపము చేయించువాడు ఆయనే" అను భావము సరైనది కాదు.

F. దేవుడు ఆత్మస్వరూపి. యోహాను 4:24.

1. దేవుడు పదార్థము కాదు, ప్రకృతి సంబంధమైన వాడుకాడు.

2. అదృశ్యుడు. కంటికి కనబడనివాడు. కొలస్స 1:15.

1 తిమోతి 6:16.

3. దేవునికి ఏ రూపము ఆపాదించగలము?

G. దేవుడు ప్రేమాస్వరూపి. 1 యోహాను 4:12.

1. దేవుడు ప్రేమయై యున్నాడు.

2. దైవప్రేమ పక్షపాతము లేనిది, స్వార్థము లేనిది.

మత్తయి 5:45.

3. దైవప్రేమ ప్రతిఫలమును ఆశించనిది.

4. కృప, కనికరము, దయ, కరుణ, దీర్ఘశాంతము గలవాడు.

III ముగింపు :

A. అనేక మంది దేవుళ్లంటే సృష్టి యింత క్రమముగా కొనసాగదు.

B. దేవుడు ఒక్కడే. నిర్గమ 20:3; యెషయా 45:5.

C. ఆయన నీ తండ్రి. ఎఫెసి 4:6. 1 కొరింథీ 8:5-6.

D. బంగారము, వెండి, రాతి విగ్రహముల యందు దైవత్వ మున్నదని తలంపకూడదు. అపొ. 17:29.

E. నీవు సేవించు దేవునికి ఈ లక్షణములు కలవా ?

F. "నీవు నిజదేవుని నమ్మితే" ఆయన గ్రంథమేది ?
వచ్చే నెలలో చదువుదాము.

బి. జాషువా, ఏలూరు.

---

నేనేల క్రీస్తు సంఘ సభ్యుడనైతిని - 10

## రాజ్యము స్థాపించబడి క్రీస్తు ఇప్పుడు పాలించుచున్నాడని అది బోధించుచున్నది

## *(It teaches the Kingdom has been Established And Christ is Now Reigning)*

**1.** పరిచయము : రాజ్యము భవిష్యత్తులో రాబోవుచున్నదని, క్రీస్తు భూమి మీద సరిగ్గా వెయ్యేండ్లు పరిపాలిస్తాడని చెప్పే సిద్ధాంతము అనేకులను కలవరపరచింది. ఈ సిద్ధాంతము లోకములోని అనేక డినామినేషన్లను దండెత్తింది; మరియు వారి బోధకులు బహిరంగముగా దానిని ప్రకటించుచున్నారు. అదుపులేని మానవ

అభూతకల్పనవలన కలిగిన విపరీతమైన సిద్ధాంతమును నేనెన్నడు బలపరచలేను. వెయ్యేండ్ల పాలన (Premillenialism) అని అది చెప్పబడుచున్నది. క్రీస్తు రెండవరాకడలో మానవుని భౌతికస్థితి అంతమవదు గాని సరిగ్గా వెయ్యేండ్ల మట్టుకు ఉండే క్రొత్తయుగము ఉద్ఘాటించబడునని, ఆ కాలములో క్రీస్తు యెరూషలేములో ఉండి భూమిమీద భౌతికంగా జీవించుచున్నవారిని వెయ్యేండ్లు పాలించునని ఆ సిద్ధాంతము చెప్పుచున్నది. కొన్ని సంగతులు గ్రహించుకొనడం కష్టమే గాని, యిది సత్యము కాజాలదని గ్రహించుకొనడం యేమంత కష్టము కాదు.

2. రాజ్యము స్థాపించబడి యున్నది : మొదటిగా, రాజ్యము స్థాపించబడి యున్నది గనుక ఆ సిద్ధాంతము నిజము కాదు :

1. నెబుకద్నెజరు కనిన కలను దాని భావమును దానియేలు చెబుతు ఇట్లన్నాడు : "ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు... అది యుగములవరకు నిలుచును" (దానియేలు 2:44). ఏ రాజులు? ఆ కలయొక్క భావార్థమునుబట్టి లౌకిక, అలౌకిక చరిత్రల దృష్ట్యా రోమా సామ్రాజ్యపు రాజులు. రోమీయులు మానవుని పాలించు సమయంలో దేవుని నిరంతర నిత్యరాజ్యము స్థాపించబడవలసి యుండెను.

2. ఆ రాజుల కాలములో బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చి "పరలోకరాజ్యము సమీపించియున్నది, మారుమనస్సు పొందుడని" ప్రకటించుచుండెను.

3. యోహాను చెరసాలలో వేయబడిన తరువాత యేసు, "కాలము సంపూర్ణమైయున్నది, దేవుని రాజ్యము సమీపించి యున్నది" యని ప్రకటించెను.

4. తరువాత యేసు రాబోవు రాజ్యముకొరకు ప్రార్థించాలని శిష్యులకు బోధించాడు : "పరలోకమందున్న మా తండ్రీ, నీ

నామము పరిశుద్ధపరచబడునుగాక; నీ రాజ్యము వచ్చుగాక" (మత్త 6:9, 10).

5. అప్పటికి జీవించియున్న కొందరి శిష్యుల జీవితకాలములోనే ఆ రాజ్యము వచ్చునని క్రీస్తు బోధించాడు : "మరియు ఆయన-ఇక్కడ నిలిచియున్నవారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచిచూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను" (మార్కు 9:1). రాజ్యము స్థాపించబడైనా యున్నది లేదా పంతొమ్మిదివందల సంవత్సరములపైనుండి జీవించుచున్న కొందరు శిష్యులు ఇంకా ఈ లోకంలో యున్నారు. వారితో పోల్చుకొంటే మెతూషెల 969 సంవత్సరముల ప్రాయములో బాల్యదశలోనే చని పోయాడు !

6. మత్తయి 18:3లో శిష్యులు అప్పటికింకా రాజ్యములో ప్రవేశించలేదు; ఏలయనగా "మీరు మార్పునొంది బిడ్డలవంటివారైతేనేగాని పరలోకరాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని" యేసు చెప్పాడు.

7. డెబ్బదిమంది శిష్యులను పంపిస్తూ యేసు "దేవుని రాజ్యము మీ దగ్గరకు వచ్చియున్నదని వారితో చెప్పుడి" యని వారికి చెప్పాడు (లూకా 10:9). అది త్వరలో స్థాపించబడబోవుచున్నది.

8. ప్రభువురాత్రి భోజనము దగ్గర అది యింకా భవిష్యత్తులోనే యుండెను : "ఇకమీదట దేవుని రాజ్యము వచ్చువరకు నేను ద్రాక్షారసము త్రాగనని మీతో చెప్పుచున్నాననెను" (లూకా 22:18).

9. రాజ్యము స్థాపించబడిన కచ్చితమైన తేదీకి మనము ఇప్పుడు వచ్చాము. మార్కు 9:1 లో రాజ్యము బలముతో లేక శక్తితో వచ్చునని యేసు చెప్పినది జ్ఞాపకముంచుకొనుము; ఈ శక్తి అపొస్తలు

లకు యెరూషలేములో రావలసియుండెనని కూడ జ్ఞాపకముంచుకొనుము (లూకా 24:49). ఈ శక్తి అపొస్తలులకు యెరూషలేములో క్రీస్తు పునరుత్థానుడైన తరువాత పెంతెకోస్తునాడు వచ్చింది (అపొ. కా. 2:1-4); గనుక రాజ్యము పెంతెకోస్తునాడు వచ్చినది. రాజ్యపు తాళపుచెవులు పేతురుకియ్యబడినవి (మత్తయి 16:19). తాళపుచెవులు అధికారమునకు గుర్తు. అందువలన రాజ్యముయొక్క ద్వారములు తెరిచే అధికారము పేతురుకు ఇయ్యబడినది, లేదా దానిలో ప్రవేశించే అర్హతలను ప్రకటించే అధికారమియ్యబడినది. రాజ్యములో ప్రవేశించే అర్హతలను ప్రకటించుటద్వారా పేతురు పెంతెకోస్తునాడు ఈ యధికారాన్ని వినియోగించుకొన్నాడు (అపొ.కా. 2); అతడు తాళపుచెవులను వినియోగించి ఆ తరమువారును మిగతా తరముల వారందరును ప్రవేశించునట్లు రాజ్యపు తలుపులను పూర్తిగా తెరచి యుంచాడు. దేవుని ప్రణాళికకు విధేయత చూపించుట వలన ఆనాడు మూడు వేలమంది ఆ రాజ్య పౌరులయ్యారు : "కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి; ఆ దినమందు యించుమించు మూడువేలమంది చేర్చబడిరి" (అపొ.కా. 2:41).

10. పెంతెకోస్తునుండి కొద్ది సంవత్సరముల తరువాత వారు ఈ రాజ్యములో యున్నారని పౌలు వ్రాసాడు : ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములోనుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్య నివాసులనుగా చేసెను" (కొలస్స 1:13). రాజ్యములేకపోతే వారు రాజ్యనివాసులు కాజాలరు. రాజ్యము ఇంకా భవిష్యత్తులో యున్నదను సిద్ధాంతము పౌలును నేరుగా వ్యతిరేకించుచున్నది.

11. హెబ్రీ 12:28 ప్రక్కన ఉంచితే ఈ సిద్ధాంతము యొక్క అసంగతము మరల కనబడును : "అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది దైవకృప కలిగియుండము". మనము నిశ్చలమైన

రాజ్యాన్ని పొందియున్నాము. అది చలింపబడనిదైతే అది నిత్యము నిలుచును. నిత్యము నిలిచే రాజ్యాన్ని మనం పొందియుంటే, మరొకటి ఆరంభమయ్యేటట్లు అది అంతముకాదు. గనుక భవిష్యత్తులో స్థాపింప బడే రాజ్యము యేదీ లేదు.

12. భూమిమీద స్థాపింపబడే రాజ్యముకొరకు ఎదురుచూడడం విపరీతం. రాజ్యము స్థాపింపబడి యున్నది, అది భూసంబంధమైనదిగాక ఆత్మీయమైనది: "నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు" (యోహాను 18:36). యేసుయొక్క ఈ మాటలను నేరుగా కాదనే సిద్ధాంతాన్ని మానవుడు కల్పించడం చాల విచారము.

3. క్రీస్తు సింహాసనము పరలోకమందున్నది: రెండ వదిగా, క్రీస్తు సింహాసనము పరలోకమందున్నది గనుక వెయ్యేండ్ల పాలన సిద్ధాంతము లేఖన విరుద్ధమైనది:

1. క్రీస్తు "సింహాసనాసీనుడై యేలును" అని జెకర్యా చెప్పాడు (జెకర్యా 6:13). క్రీస్తు ఇప్పుడు దేవుని కుడి పార్శ్వమున కూర్చుని యున్నాడు (అపొ.కా. 2:30-35). గనుక క్రీస్తు సింహాసనము భూమి మీద గాక దేవుని కుడి పార్శ్వమున యున్నది!

2. క్రీస్తు సింహాసనాసీనుడై యాజకత్వము చేయునని జెకర్యా చెప్పాడు (జెక 6:13). క్రీస్తు పరలోకంలో గొప్ప ప్రధాన యాజకుడై యున్నాడని పౌలు చెప్పాడు (హెబ్రీ 4:14). గనుక క్రీస్తు సింహాసనము భూమిమీద గాక పరలోకంలో యున్నది!

3. క్రీస్తు ఎక్కడ యాజకుడు కాజాలడో అక్కడ సింహాసనము కలిగియుండలేడు ఏలయనగా "ఆయన సింహాసనాసీనుడై యాజకత్వము చేయును" (జెక 6:13). క్రీస్తు భూమిమీద యాజకుడు కాజాలడు: "ధర్మశాస్త్రప్రకారము అర్పణలు అర్పించువారున్నారు గనుక ఈయన భూమిమీద ఉన్నయెడల యాజకుడై యుండడు" (హెబ్రీ 8:4). అందు

వలన ఆయన సింహాసనము భూమిమీద యుండుట అసాధ్యము. అది పరమందు ఉండి యుండాలి!!

## 4. క్రీస్తు దావీదు సింహాసనముపై యున్నాడు

మూడవదిగా, ఇప్పుడు క్రీస్తు దావీదు సింహాసనము మీద యున్నాడను వాస్తవం ఈ సిద్ధాంతమొక కల్పన యని గర్హించుచున్నది:

1. దావీదు సింహాసనము క్రీస్తుకు ఇయ్యబడునని దేవుడు వాగ్దానం చేసాడు (లూకా 1:32).

ఈవాగ్దానం నెరవేర్చబడినది: "అతడు ప్రవక్తయై యుండెను గనుక అతని గర్భఫలములోనుండి అతని సింహాసనముమీద ఒకని కూర్చుండబెట్టుదును అని దేవుడు తనతో ప్రమాణ పూర్వకముగా ఒట్టుపెట్టుకొనిన సంగతి అతడెరిగి, క్రీస్తు పాతాళములో విడువబడలేదనియు ఆయన శరీరము కుళ్ళిపోలేదనియు దావీదు ముందుగా తెలిసికొని ఆయన పునరుత్థానమునుగూర్చి చెప్పెను" (అపొ.కా.2:30, 31). దావీదు సింహాసనముపై కూర్చుండుటకు క్రీస్తు పునరుత్థానుడయ్యాడు; గనుక ఆయన ఇప్పుడు దావీదు సింహాసనముపై యున్నాడు. ఆయన అక్కడ ఇప్పుడు లేడని చెబితే ఆయన పునరుత్థానమును నిరాకరించుటయే యగును.

2. క్రీస్తు "సింహాసనాసీనుడై యేలును" అని జెకర్యా మనకు తెలియజేయుచున్నాడు (జెక 6:13). సింహాసముపై కూర్చొనడం, యేలడం ఏకరీతిగా ఒకే కాలంలో జరుగును. ఆయన సింహాసముపై ఆశీనుడైనప్పుడు యేలుట కారంభించాడు; యేలుట కారంభించినప్పుడు సింహాసనాసీనుడయ్యాడు. ఆయన ఇప్పుడు ఆశీనుడై యున్నాడని నిరూపించగలిగితే, ఇప్పుడు పరిపాలస్తున్నాడని నిరూపించియుందుము. దాని ఋజువును వినుము: "ఈ యేసును దేవుడు లేపెను; దీనికి మేమందరము సాక్షులము. కాగా ఆయన దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింప

బడి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానమును తండ్రివలన పొంది, మీరు చూచుచు వినుచున్న దీనిని కుమ్మరించి యున్నాడు. దావీదు పరలోకమునకు ఎక్కిపోలేదు; అయితే అతడిట్లనెను - నేను నీ శత్రువులను నీ పాదములక్రింద పాదపీఠముగా ఉంచువరకు నీవు నా కుడిపార్శ్వమున కూర్చుండుమని ప్రభువు నా ప్రభువుతో చెప్పెను" (అపొ.కా. 2:32-35). క్రీస్తు ఇప్పుడు దేవుని కుడిపార్శ్వమున కూర్చొని యున్నాడు; గనుక ఆయన ఇప్పుడు తన సింహాసనాసీనుడై పాలించుచున్నాడు.

5. అంత్యదినములు: నాలుగవదిగా, మనమిప్పుడు అంత్యదినములలో జీవించుట లేదని బోధించుటవలన ఈ సిద్ధాంతము అసత్యము. పెంతెకొస్తునాడు పేతురు ఇవే 'అంత్యదినములు' అని చెప్పిన మాటే ఆ సిద్ధాంతము పచ్చి అబద్ధమని నిరూపించుటకు సరిపోతుంది. వెయ్యేండ్ల పాలనను గూర్చి వాదించు వారందరు మనమిప్పుడు అంత్యదినములలో జీవించుట లేదందురు. క్రీస్తు వచ్చినప్పుడు వెయ్యేండ్లమట్టుకు ఉండే ఒక కాలాన్ని ఉద్ఘాటిస్తాడని వారు బోధిస్తారు. కాని పేతురు ఇట్లు చెప్పాడు: "యోవేలు ప్రవక్తద్వారా చెప్పబడిన సంగతి యిదే. అంత్యదినములయందు నేను మనుష్యులందరిమీద నా ఆత్మను కుమ్మరించెదను" (అపొ.కా. 2:16, 17). పెంతెకొస్తు దినము, రాజ్యము స్థాపింపబడిన దినము అంత్యదినములని పేతురు చెప్పుచున్నాడు. గనుక ఈ అంత్యదినములైపోయిన తరువాత, ఉండే దినములు యేమీ లేవు. వెయ్యేండ్ల పాలనను సమర్థించువారు పరిశుద్ధాత్మునికి భిన్నముగా యున్న మరొక సందర్భమిది!

6. 1 కొరింథీ 15:23-25: 1 కొరింథీ 15:23-25 ప్రకారం వెయ్యేండ్లపాలన సిద్ధాంతము నుంచినప్పుడు అదొక భ్రాంతి యని విశదమగును. "ప్రతివాడును తన వరుసలోనే బ్రదికింపబడును; ప్రథమ ఫలము క్రీస్తు; తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయన వారు బ్రదికింపబడుదురు (క్రీస్తు రాకడలో జరుగు పునరుత్థానము). అటు

తరువాత ఆయన (తన మేలుబడి ఆరంభించుట కాదుగాని) సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యమును (స్థాపించుట కాదుగాని) అప్పగించును; అప్పుడు (వెయ్యేండ్ల పాలన ఆరంభము కాదుగాని) అంతము వచ్చును. ఎందుకనగా తన శత్రువులందరిని తన పాదముల క్రింద ఉంచువరకు ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను" (రాజ్యపాలన చేయుట కారంభించుట కాదుగాని, పరిపాలించి అంతమువరకు రాజ్యపరిపాలన చేయుచుండవలెను). ఈ లేఖన భాగము బోధించు వాస్తవాన్ని వక్కాణించుటకు బ్రాకెట్లలోని మాటలు గ్రంథకర్తచే వ్రాయబడినవి.

7. భూమి కాలిపోవును : క్రీస్తు మరల వచ్చినప్పుడు ఈ భూమిపై "రాజ్యపరిపాలన చేయడు; ఎందువలనంటే ఈ భూమి కాలిపోవును: అయితే ప్రభువుదినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహా ధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కుటమైన మహావేండ్రముతో లయమై పోవును, భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును" (2 పేతురు 3:10). భావిలో రాజ్యమున్నదని చెప్పు సిద్ధాంతులు క్రీస్తు రాజ్యాన్ని, ఆయన సింహాసనాన్ని ఎక్కడ ఉంచుతారు? భూమిమీద మాత్రము కాదు; ఏలయనగా అది మహా వేండ్రముతో కాలి లయమై పోవును! [సశేషం]

**278** పేజీలు గల "నేనేల క్రీస్తు సంఘ సభ్యుడనైతిని" యనే పుస్తకాన్ని తప్పక చదువండి. వలయువారు ఈ దిగువ చిరునామాకు **2-50** రూ॥ల పోస్టల్ స్టాంపులను పంపి పొందండి :

SATYA VANI
P.O. Box 80
KAKINADA – 533 001.

# శాంతియుత సహజీవనము

ఈనాడు ప్రపంచ ప్రజలందరికీ అత్యావసరమైనది శాంతి యుత సహజీవనమే యనుటలో ఆశ్చర్యములేదు. ప్రపంచ చరిత్రలో ఎప్పుడూ లేని అత్యాధునిక మారణాయుధాలను సమకూర్చుకొన్న దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితు లేర్పడకుండ యుండుట కంటె సంతోషకరమైన విషయము మానవాళికి మరొకటిలేదు. పరమాణువును విభజించుట ద్వారా ఉద్భవించు శక్తిని ఎఱిగిన మానవుడు ఈశక్తిని శాంతియుత ప్రయోజనాలకు కాక నాశమునకు ఉపయోగించు కొనుటకు ప్రయత్నించుట ఎంత అవివేకమో గ్రహించ లేక పోవుచున్నాడు. అణు యుద్ధము ప్రారంభమైతే ఎవరూ దానినుండి తప్పించుకొనలేడను విషయము గ్రహించ వలసియున్నది.

"ఆయన అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేయు వాడు ....... మరియు యావద్భూమి మీద కాపురముండుటకు ఆయన యొకని నుండి ప్రతి జాతి మనుష్యులను సృష్టించెను. అపొ॥ కా॥ 17:25-26. దేవుడు తన ప్రేమ ద్వారా మానవుల కిచ్చిన సృష్టినుండి మానవుడు సూర్యరశ్మిని, వర్షమును, గాలిని, ఆహారమును, ఔషధములను, వస్త్రములను లోహములను సమస్తమును పొందుచున్నాడు. తన యింటికి నిప్పు పెట్టుకొంటున్న మానవుని మన మేమని పిలవాలి ? తన నాశనమునకు తనే శ్రమించుచున్న నేటి మానవుని ఏమనాలి ?

శాంతి యుత సహజీవనము సాగించుటకు బదులు మానవుడు తనతోటి మానవుని పైకి అత్యాధునిక మారణాయుధాలను గురిచూసి ఎక్కుపెట్టి ఉంచాడు. "మీరు పరలోక మందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడని" లోకమునకు చాటి చెప్పిన ప్రేమామయుని దైవత్వమును నేటి మానవుడు శంకించుచున్నాడు. "తాను చూచిన తన సహోదరుని ప్రేమింపని వాడు తానుచూడని దేవుని ప్రేమింపలేడు" 1 యోహా 4 : 20.

దేవునితో సహా తోటి మానవుని ప్రేమించమని చెప్పినదైవ గ్రంధము యొక్క శక్తిని మానవుడు గమనించ లేకపోవుచున్నాడు. "కాల్చబడుటకు నాశరీరము అప్పగించినను ప్రేమలేని వాడనైతే నాకు ప్రయోజన మేమియు లేదను" విశ్వప్రేమను మానవుడు గ్రహించ గలిగినపుడు ప్రపంచ శాంతి పునరుద్ధరింపబడును.

ప్రపంచమందు కోట్ల ప్రజలు ఆకలికి అలమటించు ఈ రోజులలో సంపన్న దేశాలు తమధనాన్ని ఆయుధాలు నిర్మించుకొనుటకు, యుద్ధాన్ని అంతరిక్షానికి కూడ విస్తరింపచేసే నూతన ప్రయోగాలకు, పథకాలకు ఖర్చు చేస్తూయున్నారు. ఈ ధనమును ఆయుధములకొఱకు కాక సంక్షేమ కార్యక్రమములకు వినియోగించిన యెడల ఆకలి, వస్త్రహీనత మొదలగు సమస్యలను మానవుడు ఏనాడో తరిమికొట్టియుండును.

క్రీస్తు చూపిన ప్రేమను, ఆయన మార్గమును వెంబడించినపుడు ప్రపంచమందు శాంతియుత సహజీవనము సాధించగలము.

E. K. V. ప్రసాదరావు - చెయ్యేరు.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**S A T Y A W A K K U**
P.O. Box. 80
KAKINADA-533 001

No. ..........

To
..........................................
..........................................
..........................................
..........................................